క్లుప్తంగా

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచు మల్లీశ్వరిగౌడ్

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని సర్పంచ్ మల్లీశ్వరిగౌడ్ చెప్పారు. మంగళవారం చెంగోల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనుల కోసం త్వరలో ఎమ్మెల్యే పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్, వార్డు సభ్యులు అనిత, బీరప్ప, నాయకులు వేణుగౌడ్ పాల్గొన్నారు.

శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం అందజేస్తున్న రాజేశ్వరమ్మ

దోమ: ఛత్రపతి శివాజీ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. మంగళవారం బొంపల్లి గ్రామంలో ప్రతిష్ఠించనున్న శివాజీ విగ్రహానికి ట్రస్ట్ తరఫున శివాజీ గ్రామ యూత్ సభ్యులకు రూ.50 వేల విరాళం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. ఛత్రపతిని యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు కారుకొండ రమేశ్, ముద్దం నర్సింహ యాదవ్, చాకలి భాస్కర్, గుడిసె రాములు, చంద్రకంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

వికారాబాద్ అర్బన్: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు నాబార్డ్, వివేకానంద్ ఎన్జీఓల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కొరకు ఆయా రంగాల్లో శిక్షణ పొందుతున్న మహిళా సభ్యులు మంచి నైపుణ్యం సాధించాలన్నారు. శిక్షణ అనంతరం మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించాలని కోరారు. ఆయా రంగాల్లో అభిరుచి ఉన్నవారు శిక్షణ పొంది, శిక్షణ పత్రాలుసమర్పిస్తే బ్యాంకులు రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు స్వయం సంవృద్ధి సాధించాలని సూచించారు. నాబార్డ్ డీడీఎం ప్రవీణ్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు, మెప్మా డీఎంసీ రవికుమార్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రత్నమ్మ పాల్గొన్నారు.

కోరంలేక సమీక్ష వాయిదా

తాండూరు రూరల్: తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా వేసినట్లు ఎంపీపీ అనితగౌడ్ తెలిపారు. 16 మంది ఎంపీటీసీల్లో కేవలం జినుగుర్తి ఎంపీటీసీ సీతాబాయి మాత్రమే హాజరయ్యారని, పది రోజుల్లో మరలా సమావేశం తేదీ నిర్ణయిస్తామని ఆమె తెలిపారు. అయితే ఈ సమావేశానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వస్తే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీటీసీ, సర్పంచులు అంటున్నారు.

ఉపాధ్యాయులు లేకుండా ఉత్తమ ఫలితాలు ఎలా?

దౌల్తాబాద్: పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించకుండా వంద శాతం ఫలితాలు సాధించాలంటే ఎలా అని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని బాలంపేట ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. అన్ని రంగాలను అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక పక్క వందశాతం ఫలితాలు సాధించాలని చెబుతున్న ప్రభుత్వం.. ఉపాధ్యాయులు లేకుండా ఫలితాలు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాలంపేట పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మండల నాయకులు ఆకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌తో నష్టమే..

- సర్వర్ డౌన్‌తో కష్టజీవులకు కష్టం
- ప్రహసనంగా మారిన ఉపాధి కూలీల హాజరు
- సాంకేతిక సమస్య ఉంటే మాకేంది
- చేసిన పనికి పైసలు ఇయ్యాలె: కూలీలు



ఉపాధి కూలీలకు ఎన్ఎంఎంఎస్ హాజరుపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి

మోమిన్‌పేట: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఎన్ఆర్ఈజీఎస్‌లో అనేక మార్పులు తీసుకువచ్చింది. 16 సంవత్సరాలుగా మస్టర్లలో ఉపాధి కూలీల సంతకాలు తీసుకొని హాజరు వేసేది. కానీ ఫిబ్రవరి 6వ తేది నుంచి మస్టర్లలో అటెండెన్స్‌ను ఉప సంహరించుకొని, పూర్తిగా.. ఎన్ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) ద్వారానే కూలీల హాజరు వేయాల్సి ఉంది. ఈ హాజరు ద్వారానే కూలీలకు కూలి డబ్బులు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓల బాధ్యత ఎంత మాత్రమూ లేదు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఎన్ఎంఎంఎస్ హాజరు తీసుకోవడంలో సర్వర్‌డౌన్ ఉన్నా.. అత్యవసరమై ఫీల్డ్ అసిస్టెంట్ విధుల్లో లేకపోయినా.., ఫోన్ సమస్య ఉన్నా మా హాజరు సంగతేంటని కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఈ సిస్టంతో నష్టమేనంటూ వాపోతున్నారు.

ఎలాంటి మేలు లేదు..

ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా.. ఆ రోజు కూలీ పనులు చేసినా హాజరు పడకపోతే పని చేయనట్లేనా? అని కూలీలు ప్రశ్నించగా.. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం లేదు. వారంలో ఏ ఒక్క రోజు ఎన్ఎంఎంఎస్ ద్వారా కూలీ హాజరు పడకపోతే ఆ రోజు కూలి డబ్బులు రానట్లేనని వారు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి సిస్టం ద్వారా కూలీలకు ఎలాంటి మేలు లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'టెక్నికల్ సమస్య ఉంటే మాకేంది. చేసిన పనికి పైసలు ఇయ్యాలె' అని కూలీలు కోరుతున్నారు. ఈ నెల 10వ తేదీన సర్వర్‌డౌన్ ఉండటం వలన మండల పరిధిలో సుమారుగా 1,289మంది కూలీలు పని చేసినా హాజరు పడలేదు. ఈ విషయమై జిల్లా అధికారులను సంప్రదించినా సమాధానం లేదని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఏ రోజు సర్వర్ డౌన్ ఉన్నా, ఎఫ్ఏ లేకున్నా, ఫోన్ సమస్య ఉన్నా తిరిగి మరుసటి రోజు హాజరు తీసుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని సిబ్బంది, కూలీలు ఉన్నాతాధికారులను కోరుతున్నారు.

10న అటెండెన్స్ పడలేదు



ఈ నెల 10వ తేదీన మండల పరిధిలో 1,289మంది కూలీలు ఉపాధి పనులు చేశారు. వారికి ఎన్ఎంఎంఎస్ ద్వారానే హాజరు తీసుకోవాలి. కానీ ఆ రోజు సర్వర్ డౌన్ వలన హాజరు తీసుకోలేదు. మరుసటి రోజు కూలీలకు తిరిగి హాజరు తీసుకునేందుకు ఎడిట్ ఆప్షన్ లేదు. దీంతో కూలీలకు ఇబ్బందే. ఎడిట్ అనుమతి కొరకు ఉన్నాతాధికారులకు లేఖ రాయాల్సి ఉంటుంది.

– ఏపీఓ శంకర్, మోమిన్‌పేట

మాలాంటి వారికి కష్టమే..



మాకు ఎన్ఎంఎంఎస్ హాజరు అంటే ఏంటో తెలియదు. వారంలో చేసిన పనులకు బ్యాంకులో జమ చేయడం వలన ఎన్ని డబ్బులు, ఎన్ని రోజులకు వచ్చాయన్నది తెలియదు. హాజరు పడకపోయినా మాకు తెలియదు. ఇలాంటి సిస్టంతో హాజరు తీసుకోవడం మాలాంటి వారికి కష్టమే.

– ఎల్లయ్య, ఉపాధి కూలీ, ఎన్కేపల్లి

పది యూనిట్లకు కమిటీ ఆమోదం

కలెక్టర్ నారాయణ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: టీఎస్ ఐపాస్ కింద ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న 17 యూనిట్లకు గాను 10 యూనిట్లను కమిటీ ఆమోదించిందని, ఒక యూనిట్‌ను రిజెక్ట్ చేసిందని, మరో ఆరు యూనిట్లను పరిశీలనలో ఉంచినట్లు కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం రూ.54,50,227 లక్షల సబ్సిడీ రుణాలు ఆమోదించినట్లు తెలిపారు. సమీక్షలో జిల్లా పరిశ్రమల అధికారి వినయ్ కుమార్, గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడి బాబు మోజస్, ఎల్‌డీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతంగా ఎదగాలి

బంట్వారం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. మంగళవారం బంట్వారం జెడ్పీహెచ్ఎస్, కోట్‌పల్లి మండలంలోని మోత్కుపల్లి పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని పలు అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. మనఊరు–మనబడి పనుల పురోగతిపై ఆరా తీశారు. తొలిమెట్టు, టీచర్ల ఆన్‌లైన్ డేటా, పేరెంట్స్ మీటింగ్, బయోమెట్రిక్, మధ్యాహ్న భోజనంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నర్సింహులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న జీపీ సిబ్బంది. చిత్రంలో సర్పంచ్, జీపీ కార్యదర్శి

కుల్కచర్ల: గ్రామపంచాయతీని ఆహ్లాదంగా, ఆదర్శవంతంగా తీరిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ సామ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిలు తెలిపారు. మంగళవారం గ్రామ పరిసరాలు, గ్రామ కంఠం పరిధిలోని ఖాళీ స్థలాల్లో మొలిచిన పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశానుసారం గ్రామాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గ్రామస్తులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా.. గ్రామపంచాయతీ వాహనాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని సమస్యలకు చదువే పరిష్కారం

- మహిళలు స్వయం కృషితో ఎదగాలి
- మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర



మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కమిషనర్

వికారాబాద్ అర్బన్: మహిళలు స్వయం కృషితో రాణిస్తూ.. వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని సమస్యలకు చదువే పరిష్కారమని, పొదుపు సంఘాల ద్వారా మహిళలకు వస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా మరింత బలపడాలని సూచించారు. మహిళలు వ్యాపారం, చదువులో పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. వారం రోజుల పాటు మహిళలకు నిర్వహించిన పలు రకాల పోటీల్లో గెలుపొందిన వారికి కమిషనర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు సబిత, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వాసవి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మనసు ప్రశాంతం



పూజలో పాల్గొన్న బీసీ కమిషన్ సభ్యుడు తదితరులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లి కెంపిన మఠంలో మంగళవారం లింగైక్య శంకరస్వాముల 23వ పుణ్యస్మరణ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా మఠంలో ఉదయం ధ్వజారోహణంతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం జరిగిన గోపూజలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో దైవ చింతన కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, వేద పండితులు సాంబశివశర్మ, వీరశైవ సమాజం అధ్యక్షుడు విజయ్, బస్వరాజ్ పటేల్, డాక్టర్ భక్తవత్సలం, ఆత్మలింగం, వీరేశం, చెక్క వీరన్న, బుచ్చప్ప, విద్యాసాగర్, కిశోర్, కేదర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హస్నాబాద్ క్లస్టర్ జీహెచ్ఎం మారుతి నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ప్రాథమిక స్థాయిలో లక్ష్యం ఏర్పాటు చేసుకుంటూ ఉన్నతంగా ఎదిగేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య, సీఆర్‌పీ శ్రీనివాస్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ రాములు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిట్టుబాటవుతోందా?

- రైతులు, వ్యాపారులతో ఎమ్మెల్యే ఆనంద్
- మార్కెట్లో వసతులు కల్పిస్తానని హామీ

వికారాబాద్ అర్బన్: ఎలా ఉన్నారు? కూరగాయల ధరలు ఎలా ఉన్నాయి? వ్యాపారం ఎలా సాగుతోంది? గిట్టుబాటు అవుతోందా? అని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.. రైతులు, వ్యాపారులకు కుశల ప్రశ్నలు వేశారు. మంగళవారం ఉదయం కూరగాయల బీట్ మార్కెట్‌లో పర్యటించిన ఎమ్మెల్యే.. వ్యాపారులు, రైతుల యోగక్షేమాలు అడిగి తెలుసుకోగా.. వారు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

దేశ ప్రజలను దోచుకుంటున్న ప్రభుత్వాలు

- ధరలు పెంచుతూ భారం మోపుతున్న మోదీ
- మాయమాటలతో మోసం చేస్తున్న కేసీఆర్
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ ధ్వజం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న రమేష్ మహరాజ్

తాండూరు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా తెలంగాణ ప్రజలను దోచుకుంటున్నాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ ఆరోపించారు. మంగళవారం కాంగ్రెస్ హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా తాండూరు పట్టణం పాత తాండూరులోని 16,17,18 వార్డుల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ తమ నియంత పాలనతో దేశాన్ని అధోగతి పాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

నిత్యావసర సరకుల ధరలు పెంచి దేశ ప్రజలపై మోదీ మోయలేని భారం మోపుతుంటే.., డబుల్ బెడ్‌రూం, దళితులకు మూడెకరాల భూమి అంటూ రాష్ట్ర ప్రజలను మాయమాటలతో కేసీఆర్ మోసగిస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు దేశ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన చెప్పారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పేదల అభ్యున్నతి కోసం కృషి చేసే పార్టీగా తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, ఉత్తంచంద్, నర్సింహులు, నర్సిరెడ్డి, అలీమ్, నగేష్, మల్లికార్జున్, బస్వరాజ్, సర్దార్ ఖాన్, ప్రభాకర్ గౌడ్, సంతోష్, భీమ్ శంకర్, హబీబ్ లాలా, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

టేకుల్‌కోడలో..



కొడంగల్ రూరల్: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొడంగల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమం చేపట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ శ్రేణులు మండల పరిధిలోని టేకుల్‌కోడ గ్రామంలో జోడో యాత్ర చేపట్టారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఇంటింటికీ తిరుగుతూ.. పార్టీ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రచారం ముమ్మరం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని గుర్తు చేస్తూ.. మునుముందు చేపట్టబోయే కార్యక్రమాలను పార్టీ నేతలు వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, పట్టణ అధ్యక్షుడు నయీమ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్, కౌన్సిలర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటికీ బీజేపీ

తాండూరు టౌన్: నేటి నుంచి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ తాండూరు పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించారు. బుధవారం ఉదయం 8గంటలకు మల్‌రెడ్డిపల్లి హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమై.. ఈనెల 19 వరకు తాండూరు పట్టణం వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

పార్కు అభివృద్ధికి నిధులు

తాండూరు రూరల్: పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ అనితగౌడ్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న పార్కును ఆమె పరిశీలించి మాట్లాడారు. 1972 సంవత్సరంలో బ్లాక్ సమితీ ఉన్న సమయంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పాత పార్కు ఉండేదని, 40 ఏళ్లుగా పిచ్చిమొక్కలు పెరిగి వృథాగా మారిందని చెప్పారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలతో ఆ పార్కుకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. మండల పరిషత్ నిధులు కేటాయించి పార్కు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంపీఓ రతన్‌సింగ్, ఎంపీటీసీ సీతాబాయ్, సర్పంచ్ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



శకటోత్సవం ప్రారంభిస్తున్న పూజారులు

శోభాయమానంగా శకటోత్సవం

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో మంగళవారం సాయంత్రం శకటోత్సవం ఘనంగా నిర్వహించారు. రైతులు, భక్తులు తమ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో రామలింగేశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు దశరథం, పాండు, అనంతమయ్యలు స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు.

క్షయవ్యాధి నిర్మూలనకు చర్యలు

- ప్రజలు తప్పనిసరిగా వైద్య పరీక్ష చేయించుకోవాలి
- ఉపకేంద్రం వైద్యాధికారి శ్రీనివాస్



దోమ: రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్

దోమ: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దాదాపూర్ ఉపకేంద్రం వైద్యాధికారి శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని ఉపకేంద్రం ఆవరణలో ఆరోగ్య మేళాను ఆయన ప్రారంభించారు. అనంతరం రోగులకు క్షయ పరీక్ష చేసి, అవసరమైన మందులు పంపిణీ చేసి మాట్లాడారు. క్షయ నిర్మూలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేసేందుకు ఆరోగ్య మేళా కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, సాయంత్రం కాగానే చలివేస్తుందని, అంతే కాకుండా చెమట పట్టడం, ఆకలి తగ్గిపోవడం, తొందరగా అలసిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని చెప్పారు. టీబీ ఉన్నవారికి ప్రభుత్వం ఔషధాలు అందుబాటులోకి తెచ్చిందని, వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స అందిస్తామని వెల్లడించారు. టీబీ లక్షణాలు ఉన్నవారికి నెలనెలా రూ.500తో పాటు పౌష్టికాహారం ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. గ్రామస్తులందరూ తప్పనిసరిగా టీబీ పరీక్ష చేయించుకొని, ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. సర్పంచ్ కృష్ణ, ఉపసర్పంచ్ గఫార్, ఉప కేంద్రం సూపర్‌వైజర్ నిర్మల, ఏఎన్ఎం ప్రమీళ, ఆశ వర్కర్లు మాధవి, చంద్రకళ, లక్ష్మి, అంజమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటిస్తే మేలు..



మర్పల్లి: క్షయపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

మర్పల్లి: ఆరోగ్య సూత్రాలు పాటిస్తే క్షయవ్యాధి దరిచేరదని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నేహ అన్నారు. కొత్లాపూర్ గ్రామంలో క్షయ నివారణపై ఆరోగ్య మేళ నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ నేహ మాట్లాడుతూ క్షయ(టీబీ) అంటువ్యాధని, ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఎవరికీ సోకదని చెప్పారు. ఈ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని, వీలైనంత వరకు ఎవరైనా దగ్గినా, తుమ్మినా నోటికి చేతి రుమాలు అడ్డుపెట్టుకొని తుమ్మాలని సూచించారు. హెచ్ఈఓ తిరుపతయ్య, సర్పంచ్ ప్రభాకర్, పీహెచ్‌సీ సూపర్ వైజర్ అమరేశ్వరీ, టీబీ హెచ్‌వీ నరేందర్, ల్యాబ్ అసిస్టెంట్ రేణుక, ఏఎన్ఎం వసంతరాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పరిగి: క్షయవ్యాధి గ్రస్తులు ఎల్లప్పుడూ పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ పద్మమ్మ సూచించారు. మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో క్షయ రోగులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించి, వారికి పౌష్టికాహారం అందజేశారు. వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, వ్యాధి నిర్ధారణ, మందులు ఎలా వాడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు.